

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిస్థాయిలో విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటు అన్నారు. విద్యా వ్యవస్థ ముందుకు సాగే పరిస్థితులు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలు ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పూర్తి రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు భరోసా ఏదీ?

- బాసట కోసం పేదలు ఎదురుచూపు
- పులివెందులలో 25 శాతం దత్తత
- మార్గదర్శకులవ్వాలని అధికారులపై ఒత్తిడి
- మార్గదర్శకుల మధ్య కుదరని లంకె

ప్రజాశక్తి-పులివెందుల టౌన్



రాష్ట్రంలో పేదరికం లేకుండా చేస్తానంటూ ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు పి-4 పేరుతో కార్యచరణను రూపొందించింది. సర్వేపేరుతో అత్యంత పేదరికంలోనున్న కుటుం బాలను గుర్తించింది. 'బంగారు కుంటుం బాలు' అని నామకరణం కూడా చేసింది. దీనికి ప్రభుత్వ పరంగా అందించే సహాయం కంటే సంపద కలిగున్న వారు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారికి అవసరమైన ఆర్థిక ఇతర తోడ్పా టును అందించి పేదరికం నుంచి గట్టెక్కిం చాలన్నది ప్రభుత్వం లక్ష్యం. ఆచరణలో చూసి నప్పుడు బంగారు కుటుంబాలకు దత్తత తీసుకునే మనసున్న మారాజులు ఇప్పుడు కనిపిం చడం లేదు. దీంతో బంగారు కుటుంబాలు ఎప్పటి లాగానే దిక్కులేని కుటుంబాలుగానే ఉంటు న్నాయి.

జిల్లాలో 41.45 శాతమే దత్తత తీసుకుంటే, పులివెందులలో మాత్రం 25 శాతం మాత్రమే ఉంది. జిల్లాలో 68,354 బంగారు కుటుంబాలున్నట్టు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. 1,94,993 మంది ఈ కుటుంబాల పరిధి లోనున్నారు. ఇందులో ఇప్పటి వరకు దత్తత తీసుకున్న కుటుంబాలు చూస్తే 28,338 కుటుంబాలున్నాయి. 79,892 మందిని దత్తత తీసుకున్నారు. ఇప్పటి వరకు దత్తత తీసుకున్న మార్గదర్శకులు ఎంతమంది అని చూస్తే 4258 మంది ఉన్నట్లు తెలుస్తుంది. ఈ లెక్కల్లోనూ తప్పులున్నట్లు అధికారులు భావిస్తున్నారు. బంగారు కుటుంబాల మార్గదర్శకులుగా నమోదు చేసే సమయంలో తప్పిదాలు జరిగి ఈ సంఖ్య ఎక్కువగా నమోదైనట్లు తెలుస్తోంది. ఈ లెక్క ప్రకారం చూసుకున్నా ఇప్పటి వరకు 41.45 శాతం కుటుంబాలకే మార్గదర్శకులు ముందుకొచ్చారు. జిల్లాలో 1 కార్పొరేషన్, 6 మున్సిపాలిటీలు, 37 మండలాలు ఉన్నాయి. ఇందులో అన్నిటిలోనూ బంగారు కుటుంబాల ఎంపిక జరిగింది. జిల్లాలో మొత్తం 645 సచివాలయాలుంటే 620 సచివాలయాల పరిధిలో బంగారు కుటుంబాలు ఎంపిక చేశారు 25 సచివాలయాలలో ఇంకా చేయాల్సి ఉంది. నియోజకవర్గాల వారీగా చూస్తే బద్వేల్‌లో 9519 కుటుంబాలకు గాను 6067 కుటుంబాలు 63.73 శాతం. జమ్మలమడుగులో 10938 గాను 3018 కుటుంబాలు 27.59 శాతం. కడప 9103 గాను 4853 కుటుంబాలు 53.31 శాతం. కమలాపురం లో 8080 గాను 4457 కుటుంబాలు 55.16 శాతం. మైదుకూరు లో 10731 గాను 2798 కుటుంబాలు 26 శాతం. ప్రొద్దుటూరు లో 8041 గాను 2493 కుటుంబాలు 31 శాతం. పులివెందుల లో 8830 గాను 2219 కుటుంబాలు 25 శాతం. సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలలో 3112 గాను 2433 కుటుంబాలు 78 శాతం దత్తత తీసుకున్నట్లు ఆన్లైన్ ద్వారా తెలుస్తుంది.

అధికారులపై ఒత్తిడి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ కార్యచరణ అమలు బాధ్యత ఎక్కువగా అధికారులపైనే పడుతోంది. అధికారులకు ప్రత్యేకంగా ఉన్నతాధికారులు లక్ష్యాలు కూడా పెట్టారు. ఒక్కో అధికారి, ఉద్యోగి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని చెప్పడంతో విధిలేని పరిస్థితుల్లో పేర్లు నమోదు చేసుకున్నారు. అక్కడక్కడా అధికార పార్టీ నేతలు కూడా కొంత మంచి మార్గదర్శకులుగా పేర్లు నమోదు చేసుకు న్నారు. ప్రభుత్వ పనుల కోసం వెళ్తున్న వారిపైనా మార్గదర్శకులవ్వాలన్న ఒత్తిడిన అధికారులు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇష్టపూర్వకంగా చేయాల్సిన బలవంతంగా చేయించడం ఏమిటన్న ప్రశ్నలు. ఉత్పన్నమవుతున్నాయి.

మార్గదర్శకులు, బంగారు కుటుంబాల మధ్య కుదరని లంకె

బంగారు కుటుంబాల దత్తత విష యంలో ఉన్నత స్థాయి నుంచి ఒత్తిళ్లు రావడంతో పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంలో బంగారు కుటుంబాలకు ఏమి అవసరమో కూడా పరిశీలించకుండా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. మార్గదర్శకుల ద్వారా తమకు ఏ మేరకు తోడ్పాటు అందిస్తుందో కూడా బంగారు కుటుంబాలకు తెలియడం లేదు. ఎవరికి వారు అన్నట్టుగా రికార్డుల్లో మాత్రమే నమోద య్యాయి. బంగారు కుటుంబాల అవసరాలేమిటో కూడా మార్గదర్శకులకు తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పి-4 బంగారు కుటుంబాల అంశం ఏ మేరకు ముందుకు సాగుతున్నది ప్రశ్నార్థకంగానే మారింది.

బంగారు కుటుంబం జాబితాలో చేర్చాలి

కూలీ పనిచేసుకుని జీవిస్తున్నాం. నాకు సొంత ఇల్లు కూడా లేదు. అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. మా కుటుంబాన్ని బంగారు కుటుంబ జాబితాలో చేర్చి ఆర్థికంగా సహాయం చేయాలి.

- ఈశ్వర్ రెడ్డి, కూలి, పులివెందుల

దత్తత తీసుకోవడానికి ముందుకు రావడం లేదు

పేద కుటుంబాలను దత్తత తీసుకోవడానికి మార్గదర్శకులు ఎవరు ముందుకు రాలేదని, బంగారు కుటుంబాలకు మార్గదర్శకులను అన్వేషించే అంశంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలో పూర్తిస్థాయిలో మార్గదర్శకులను ఏర్పాటు చేస్తాం.

- మున్సిపల్ కమిషనర్ రాముడు

ప్రొద్దుటూరులో దారుణం

- తల్లిని అతిదారుణంగా చంపిన కసాయి కొడుకు
- గొంతుకోసి.. ఆపై టీవీ చూస్తూ రాక్షసానందం!



కొడుకు చేతిలో దారుణ హత్యకు గురైన లక్ష్మీదేవి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు



లక్ష్మీదేవి(ఫైల్)

ప్రొద్దుటూరులో దారుణం చోటు చేసుకుంది. కన్నతల్లినే కుమారుడు గొంతుకోసి దారుణంగా చంపాడు. తల్లి ప్రాణం తీసిన అనంతరం ఎలాంటి బాధ, బెరుకు లేకుండా ఇంట్లో కూర్చుని తన సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ రాక్షసానందం పొందాడు. ఈ సంఘటన ప్రొద్దుటూరులోని శ్రీరామ్ నగర్‌లో చోటు చేసుకుంది.

పోలీసుల వివరాల ప్రకారం.. విజయ్‌భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతులు శ్రీరామ్‌నగరలో నివాసముంటున్నారు. వీరికి యశ్వతంకుమార్‌రెడ్డి అనే కుమారుడు ఉన్నాడు. లక్ష్మీదేవి పట్టణంలోని ఈశ్వర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. యశ్వంత్ మూడేళ్ల కిందట చెన్నైలో బిటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగాన్వేషణ కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఖర్చుల కోసం ప్రతి నెలా అతని తల్లి డబ్బులు పంపేవారు. ఇటీవల తల్లికి ఫోన్ చేసి రూ.3 అడిగితే పంపారు. మరో సారి రూ.10 వేలు కావాలని అడిగాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో తల్లిపై కోపం పెంచుకున్నాడు. కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఆదివారం ఉద యం హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరులోని ఇంటికి వచ్చాడు. వచ్చీ రా గానే తల్లితో గొడవకు దిగి దాడిచేశాడు. ఆమె గట్టిగా అరవడంతో ఆ కేకలు విని బెడ్‌రూమ్‌లో ఉన్న తండ్రి విజయ్‌భాస్కర్‌రెడ్డి బయటకు వచ్చే ప్రయత్నం చేయగా ఆయన్ను లోపలికి నెట్టేసి గదికి గడియపెట్టాడు. ఆ తరువాత కూరగాయల కత్తితో వెనుక నుంచి తల్లిగొంతు కోశాడు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న తల్లిని ఈడ్చుకుంటూ బయట పడేశాడు. ఆపై తలుపులు వేసుకుని ఇంట్లో దర్జాగా టీవీ చూస్తూ సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ రాక్షసానందం పొందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. నిందితుడుని అందుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం లక్ష్మిదేవి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

అవినీతిపరులపై ఉక్కుపాదం

- 15వ ఫైనాన్స్ నిధులతో అభివృద్ధి పనులు
- స్వర్ణ పంచాయతీ పోర్టల్‌తో నిధుల దుర్వినియోగానికి చెక్
- జిల్లా పంచాయతీ అధికారి జి.రాజ్యలక్ష్మీ వెల్లడి

ప్రజాశక్తి- కడప ప్రతినిధి



ముఖా ముఖి..

జిల్లాలో పంచాయతీ నిధుల స్వాహాకు పాల్పడిన అధికారులపై ఉక్కు పాదం మోపుతాం. ఎస్‌డబ్ల్యుపిసి, 15వ ఫైనాన్స్ నిధులు, హౌసింగ్ ట్యాక్స్, ఇతర విభాగాల నిధులను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలకు తీసుకుంటాం. జిల్లాలోని ఇళ్ల పన్నుల లక్ష్యాన్ని అధిగమించడంపై సీరియస్‌గా దృష్టి సారించాం. పన్నుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఉద్దేశించి స్వర్ణపంచాయతీ పోర్టల్‌ను అందుబాటులోకి తేవడమైంది. పన్ను చెల్లింపుదారులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. దీంతో పంచాయతీల్లో పన్నుల దుర్వినియోగానికి చెక్ పడుతుంది. దీనికితోడు జిల్లాలోని 557 పంచాయతీల్లో పారిశుధ్యం మొదలుకుని పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించడానికి డిప్యూటీ ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శులతో కూడిన బృందాలకు బాధ్యతలు అప్పగించడమైంది. దీంతో పారిశుధ్యం, పచ్చదనం పెంపు అంశాల్లో పురోగతి కనిపించే అవకాశం ఉంది. స్వమిత్వ పథకం కింద మూడు కేటగిరీలుగా పంచాయతీలను విభ జించడమైంది. ఫలితంగా ప్రజల స్థిరాస్తుల గణన సులభతరం కావడం ద్వారా ప్రజల ఆస్తులకు శాశ్వత హక్కుల కల్పనకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టామని పేర్కొంటున్న జిల్లా పంచాయతీ అధికారి జి.రాజ్యలక్ష్మీతో ముఖాముఖి...

పంచాయతీ అక్రమార్కులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

జిల్లాలో వేంపల్లి, చాపాడు, ఒంటిమిట్ట మండలాల్లో అవినీతి ఘటనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. జిల్లాలోని పంచాయతీ నిధులు అక్రమాలకు పాల్పడిన వారిపై సస్పెన్షన్ చేయడం, నిధులను రికవరీ చేయడం వంటి కఠిన చర్యలు తీసుకోవడమైంది. పంచాయతీ నిధుల స్వాహాదారుల నుంచి రికవరీ చేయడానికి ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

పన్నుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో చెల్లింపులు చేయడం ద్వారా ఇళ్ల పన్నులు దగ్గర నుంచి ఇతర పంచాయతీ నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకోవచ్చు. జిల్లాలోని 557 పంచాయతీల్లో నిధుల దుర్వినియోగాన్ని నిలువరించడానికి స్వర్ణపంచాయతీ పోర్టుల్‌ను అందుబాటులో ఉంచాం. జిల్లాలోని ఆయా పంచాయతీల పరిధిలోని ప్రజానీకం సాంకేతిక తోడ్పాటును సద్విని యోగం చేసుకోవాలి.

పంచాయతీల బలోపేతానికి ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

పంచాయతీల అభివృద్ధికి పెద్దపీట వేశాం. 15వ ఫైనాన్స్ నిధుల వినియోగం ద్వారా పారిశుధ్యాన్ని పెంపొందిస్తాం. ఎస్‌డబ్ల్యుపిసి ప్లాంట్ల సహాయంతో సాలిడ్ వేస్ట్ వేనేజ్ వ్యవస్థ ద్వారా చెత్తా చెదారాన్ని సేకరిం చడం ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ ఖాతాల్లో జమ చేయడం, వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసి సరసమైన ధరలకు రైతులకు విక్రయిస్తాం.

పంచాయతీ వివరాలు తెలపండి?

జిల్లాలో 557 పంచాయతీలున్నాయి. ఇందులో వేంపల్లి, చెన్నూ రు, ఖాజీపేట, కొత్తపల్లి, గోపవరం, పోరుమామిళ్ల, రంగసముద్రం, సింహా ద్రిపురం మేజర్ పంచాయతీన్నాయి. జిల్లా పంచాయతీల పరిధిలో 2,246 గ్రామాలున్నాయి. పంచాయతీల నిర్వహణ బాధ్యతలను 427 సచివాలయాల పరిధిలో గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 కేటగిరీల పరిధిలో 225 మంది కార్యదర్శులు, గ్రేడ్-5 కేటగిరీలో 321, గ్రేడ్-6 కేటగిరీలో 407 మంది కార్యదర్శులు పాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు.

పారిశుధ్య నిర్వహణ చర్యలేమిటి?

జిల్లాలో వైరల్ జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో పారిశు ధ్య పనుల పై దృష్టి సారించాం. ఆయా మండలాల పరిధిలోని డిప్యూటీ ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శులతో కూడిన బృందాలు పారిశు ధ్య నిర్వహణపై దృష్టి సారించాయి. మురుగునీరు, చెత్తదిబ్బలు, ఇతర వ్యర్థాల తొలగింపు వంటి పనులపై చర్యలు తీసుకోవడం జరుగుతోంది. జిల్లాలోని 557 పంచాయతీల పరిధిలోని 2,246 గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు 626 పారిశుధ్య నిర్వహణ కేంద్రాలు న్నాయి. మొదటి విడతలో 250 పంచాయతీలను ఎంపిక చేసుకోవడమైంది. ఈమేరకు పారిశుధ్య పనుల్లో భాగంగా చెత్తాచెదారాన్ని సేకరించడం జరిగింది. ఐవిఆర్ఎస్ సర్వేలో ఆశించిన పురోగతి కనిపించింది.

ఎల్‌డబ్ల్యుఎం కార్యకలాపాల గురించి చెప్పండి?

లిక్విడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఎల్‌డబ్ల్యుఎం)ను 525 క్లస్టర్లలో చేపట్టడం జరిగింది. ఇందులో 976 క్లాప్‌మిత్రలు, 330 షెడ్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు జిల్లాలోని ఆయా పంచాయతీల్లోని నీటి వృథాను అరికట్టడం, డ్రెయినేజీ క్లీనింగ్, డ్రెయినేజీ బ్లాకింగ్, వాటర్ స్టాగ్నేషన్ ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయడం ద్వారా దోమల వ్యాప్తిని నిరోధించడం వంటి చర్యలు తీసుకుంటున్నాం.

స్వమిత్వ పథకం గురించి తెలపండి?

స్వమిత్ర పథకం ఫేజ్-1 కింద 180 రెవెన్యూ గ్రామాల్లో అమలు చేయడమైంది. ఫేజ్-2 కింద ఆగష్టు నుంచి అక్టోబర్ వరకు 250 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసుకుని 230 గ్రామాల్లో అమలు చేయగా 191 రెవెన్యూ గ్రామాల్లో అమలు చేయడం ద్వారా పురోగతి సాధించాం. ఫేజ్-3 కేటగిరీని నవంబర్ నుంచి 2026 జవనరి 26 నాటికి మిగిలిన రెవెన్యూ గ్రామాల్లో అమలు చేయడం ద్వారా ఆయా రెవెన్యూ గ్రామాల ప్రజలకు సంబంధించిన స్థిరాస్తుల వాణిజ్యీకరణ ఊపందుకుంది. స్వమిత్వ పథకం కింద గ్రామాల్లో డ్రోన్ సర్వే ద్వారా ప్రజల ఆస్తులను గణిస్తారు. అనంతరం ప్రజల ఆస్తులకు మార్కెట్ విలువను జోడించడం ద్వారా ప్రజల ఆస్తులకు, ప్రభుత్వానికి ఆదాయానికి భద్రత లభిస్తుందని చెప్పవచ్చు.

15వ ఫైనాన్స్ నిధుల మంజూరుపై స్పందించండి?

2025-26 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడత కింద రూ.19.21 కోట్లు మంజూరు కావడమైంది. రెండవ విడత నవంబర్, డిసెంబర్ మా సాల్లో రావడానికి అవకాశం ఉంది. వీటి ద్వారా పంచాయతీల అభివృద్ధికి సత్వర చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ఉపాధ్యాయుల కృషి మరువలేనిది : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - కడప అర్బన్

భావి భారత పౌరులైన విద్యార్థులను అన్ని విధాల తీర్చిదిద్దడంలో ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అనిర్వచనీయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ సభా భవనంలో ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ అన్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రయివేట్ పాఠశాలలో పనిచేస్తున్న 110 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందన్నారు. ఈ వృత్తిలో కొనసా గుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు అంది స్తోందన్నారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి చేస్తున్న నిరుపమాన సేవలను ప్రశంసించారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 5న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే ఈ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బాల గంగయ్య, శివశంకర్ రెడ్డి, మేడా నరసిం హులు, పోలి వెంకటసుబ్బయ్య, మైథిలి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు పాత్ర కీలకం

సమాజంలో ఉపాధ్యాయుడు పాత్ర ఎంతో శక్తిమంతమైందని ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి శంకర్ అన్నారు. కడప నగరం కెఎస్ఆర్ఎమ్ ఇంజినీరింగ్ కళాశాలలో గ్లోబల్ జ్ఞాన్ అకాడమీ వారి 6వ అంతర్జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ బహుమతి వేడుకల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ విద్యార్థులను ఉపాధ్యాయులు సరిగా తీర్చిదిద్దితే జాతిరత్నాలు కాగలరన్నారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ గుప్త ఉపాధ్యాయ వృత్తిలో వారి గురుతర బాధ్యతలు వివరించారు. కెఎస్ఆర్ఎం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగేశ్వరప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా విద్యాబోధన చేయవలసి ఉందన్నారు. కార్యక్రమంలో గ్లోబల్ జ్ఞాన్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ రుక్సానా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా అంబాసిడర్ సమతా నాయుడు, కందుల లక్షుమ్మ మెమోరియల్ కాలేజీ ప్రిన్సిపల్ నగరత్నమ్మ, కె ఎస్ ఆర్ఎం కళాశాల హెచ్ఒడి లు ప్రియదర్శిని, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనపరచిన ఉపాధ్యాయులను గుర్తించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, శాలువాలతో సత్కరించారు. ముఖ్య అతిథులు డాక్టర్ పసుపులేటి శంకర్, గుప్త, నాగేశ్వరపసాద్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కెఎస్ఆర్ఎం కళాశాల ఆడిటోరియం సౌకర్యం కల్పించిన కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, కరస్పాండెంట్ రాజేశ్వరమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

అవార్డుల ప్రదానం అభినందనీయం

అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) కడప జిల్లా శాఖ ఆదర్శ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేయడం అభినందనీయమని ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. ఆదివారం ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆరుగురు ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారిని అవార్డుతో ఘనంగా సత్కరించడం సంతోషంగా ఉందని చెప్పారు. విద్య విలువల గురించి వివరించారు. భావి భారత పౌరులైన విద్యార్థులను తీర్చిదిద్దేవారు ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి సత్కరించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు కూడా వారి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా మెలుగుతూ చక్కగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. తద్వారా పుట్టిన ఊరికి, దేశానికి సేవ చేయాలని మార్గదర్శకం నిర్దేశించారు. కార్యక్రమంలో కడప ఎంఇఒ రఫీక్ అహ్మద్, ఐటా మాజీ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్, జిల్లా కార్యదర్శి అబ్బాస్ అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కెఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులను సన్మానిస్తున్న అతిథులు



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న సలావుద్దీన్

అందరూ భాగస్వాములు కావాలి

కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌస్ పీర్

ప్రజాశక్తి-కడప అర్బన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న గౌస్‌పీర్

దొంగ ఓట్లతో బిజెపి అధికారంలోకి వచ్చిన తరుణంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న ఓట్ చోర్...గద్దీ ఛోడ్ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరాన్ని గుర్తించాలని కాంగ్రెస్ పార్టీ నేత గౌస్‌పీర్ అన్నారు. ఆదివారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించిందన్నారు. ఈ హక్కుతో ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటును వేసుకుని తమకు నచ్చిన ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు వచ్చే అవకాశం లభించిందన్నారు. తమకు ప్రజల ఆదరణ లేదని తెలుసుకుని ప్రజల ఓట్లను కేంద్ర ప్రభుత్వం చోరీ చేసి అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ అంశంపై పోరాడాల్సిన ఆవశ్యకత ఒక్క కాంగ్రెస్‌పార్టీకే కాదు...పౌరులందరిపై ఉందన్నారు. అయితే దురదృష్టవశాత్తు మన రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు కేంద్రం ప్రభుత్వానికి వత్తాసు పలుకుతుండడం బాధాకరమన్నారు. ఇదే విషయంగా తమ పార్టీ అగ్రనేత పోరాటం కొనసాగిస్తున్నారన్నారు. తాము నిర్వహిస్తున్న ఈ పోరాటానికి ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, నాయకులు సిద్ధిక్, దాసరి శ్రీనివాసులు, కమాల్ బాషా, ముబారక్, ప్రత్యూష రెడ్డి, కరీం, అంజన్ కుమార్, రఫీ ఖాన్, యూసఫ్, శామీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సభాభవన్‌లో సోమవారం నిర్వహించనున్నామని డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విష యాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీ పంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునని తెలిపారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవ లను వినియోగించుకోవాలని డిఆర్ఒ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబం ధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఎఆర్ అడిషనల్ ఎస్‌పి రమణయ్య

ప్రజాశక్తి -కడప అర్బన్

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎఆర్ ఎఎస్‌పి బి. రమణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమం పోలీసు అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా చేయడమే కార్యక్రమం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వులతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్‌లో పాల్గొనే విధంగా చేయడమే ఈ కార్యక్రమమన్నారు. వాహన కాలుష్యాన్ని తగ్గించడం, పర్యావరణ స్థిరత్వానికి దోహదపడటం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని, అది వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబానికి మేలు చేస్తుందన్నారు. సైక్లింగ్ ద్వారా పర్యావరణానికి హాని కలగదన్నారు. వ్యాయమాల ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ సైకిల్ ర్యాలీ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ప్రారంభమై ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, సంధ్య సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్, మహావీర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, ఎస్‌పి బంగ్లా, రాజారెడ్డి వీధి మీదుగా తిరిగి జిల్లా పోలీసు కార్యాలయం వరకు కొనసాగింది. కార్యక్రమంలో ఎఆర్‌డిఎస్‌పి నాగేశ్వర రావు, ఆర్‌ఐలు శివరాముడు, టైటస్, శ్రీశైల రెడ్డి, కడప టూటౌన్ సిఐ గంటా సుబ్బారావు, చిన్నచౌకు సి.ఐ ఓబులేసు, ట్రాఫిక్ సిఐ జావీద్, పెండ్లిమర్రి ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, కడప వన్ టౌన్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, స్వామినాయక్, రామస్వామి రాజు, చూడామణి వర్మ, పోలీస్ అధికారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఎఆర్, సివిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశు ధ్యం, సెక్యూరిటీ కార్మికులకు పెండింగ్ వేతనాలను ఇవ్వాలని, గత కాంట్రాక్టర్ పిఎఫ్, ఇఎస్ఐ తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, రిమ్స్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు పవన్, రవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప జిజిహెచ్, పోరుమామిళ్ల, బద్వేల్, జిల్లాలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్‌లో పారిశు ధ్యం, సెక్యూరిటీ కార్మికులు పనిచేసే వారిని తెలిపారు. గత కాంట్రాక్టర్ వేత నాలు పెండింగ్‌లో పెట్టారని ఆ వేతనాలు తక్షణమే చెల్లించాలని పేర్కొన్నారు. కొంతమందికి పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా వైద్య, లేబర్, సంబంధించినటువంటి అధికారులు కార్మికుల సమ స్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ విషయాలన్నిటిపై కలెక్టర్, జెసికి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

అధికారులను విచారించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : కడప, అన్నమ్మయ్య జిల్లాలో ఎస్‌సి సాంఘిక సంక్షేమ శాఖ, బిసి వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖలో ఉన్న వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం పెట్టకుండా నాణ్యత తగ్గిస్తూ స్వయానా జిల్లా అధికారులే ప్రతి నెలా వసతి గృహ అధికారులు దగ్గర మామూలు తీసుకుంటున్నారని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న ఆరోపించారు. ఆదివారం పిడిఎస్‌యు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని కలెక్టర్లను విజ్ఞప్తి చేశారు. కడప,అన్నమ్మయ్య జిల్లాలో ఎస్‌సి సాంఘిక సంక్షేమ శాఖ, బిసి వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలో నడుస్తున్న వసతి గృహాలలో విద్యార్థులు చదువులు అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. వారి పరవేక్షణకు వసతి గృహ అధికారులు వ్యవహరిస్తూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యత లేకుండా పెడుతున్నారని చెప్పారు. కడప, అన్నమ్మయ్య జిల్లా కలెక్టర్లు స్పందించి విచారించాలని డిమాండ్ చేశారు.



టిడిపిలో చేరినవారితో మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి

టిడిపిలో చేరిన వైసిపి నేతలు

ప్రజాశక్తి - లింగాల

మండలంలోని అంబకపల్లె వైసిపి నాయకులు ఆదివారం టిడిపిలో చేరారు. టిడిపి పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రానాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో 15 కుటుంబాలు చేరాయి. వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. లింగాల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. టిడిపిలో చేరిన వారిలో రామకృష్ణారెడ్డి, లక్ష్మిరెడ్డి, అనంద్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి ఉన్నారు. పార్టీ సీనియర్ నాయకులు గంగధరరెడ్డి, రామసుబ్బారెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, దేవిరెడ్డి సంజీవరెడ్డి పాల్గొన్నారు.



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

సమాజాభివృద్ధిలో పునరంకితమవ్వాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఉపాధ్యాయులు సమాజాభివృద్ధిలో పునరంకితమవ్వాలని ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడపలో జమ్మలమడుగుకు చెందిన బాలాజీ హైస్కూల్ సీనియర్ ఉపాధ్యాయులు మహమ్మద్ బాషా (గణితం), వెంకట ప్రసాద్ (హిందీ), సంపూర్ణ (ఎలిమెంటరీ) అపుష్మ ఆధ్వర్యంలో సన్మానించారు. సన్మాన గ్రహీతలు బాషా, ప్రసాద్, సంపూర్ణ మాట్లాడుతూ బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డికి, కరస్పాండెంట్ దీప్తి నిఖిలారెడ్డికి, ఎఒ ప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 20ఏళ్లు ఒకే పాఠశాలలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి, నిఖిలారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సహా ఉపాధ్యాయులు అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు.



సమావేశంలో ఎస్‌టియు నాయకులు

విద్యారంగ సమస్యలపై నేడు ధర్నా

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని ఉపాధ్యాయుల, విద్యారంగ, ఆర్థిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో 7న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక ఎస్టీయు రీజియన్ కార్యాలయంలో చలో విజయవాడ కార్యక్రమంపై ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రీజన్ కన్వీనర్ ప్రతాపరెడ్డి, మండల శాఖ బాధ్యులు లక్ష్మీ నరసింహ, కులాయి బాబు, జిల్లా బాధ్యులు ధర్మారెడ్డి, ఎస్.ధర్మారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, డిసి గోవిందు, గోవర్ధన్, వై.భాస్కర్ రెడ్డి, మహబూబ్ బాషా, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జమ్మలమడుగు : కూటమి ప్రభుత్వం విద్యారంగ, ఆర్థిక పరమైన సమస్యలపై స్పందించకపోతే పోరుబాట తప్పదని ఎస్టీయు కడప జిల్లా శాఖ అధ్యక్షుడు ఇలియాస్ బాషా హెచ్చరించారు. ఆదివారం జమ్మలమడుగు ఎస్టీయు రీజియన్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రంగేశ్వర్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు చంద్రశేఖరరావు, చౌడయ్య మూడు మండలాల కార్యవర్గం పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా 'మాడిశెట్టి'

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎర్రగుంట్లకు చెందిన మాడిశెట్టి శివకుమార్‌ను ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. ఆ మేరకు ఆదివారం శివకుమార్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం స్టేట్ జాయింట్ సెక్రటరీగా తనను నియమిస్తూ ఉత్తర్వులు పంపినట్లు తెలిపారు. తనపట్ల నమ్మకం ఉంచి, గుర్తింపు ఇచ్చినందుకు జగన్మోహన్‌రెడ్డికి, ఎంపీ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి వచ్చేందుకు సహకరించిన వైసిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని శివకుమార్ తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్తంభాన్ని ఢీకొన్న సిమెంట్ ట్యాంకర్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అదుపుతప్పి సిమెంట్ ట్యాంకర్ ఆదివారం తెల్లవారుజామున కరెంట్ స్తంభాన్ని ఢీకొంది. పట్టణంలోని అంబకపల్లెకు వెళ్లే రింగ్ రోడ్డులో బెంగళూరు నుంచి జమ్మలమడుగు వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ డివైడర్ పైకి దూసుకెళ్లింది. అక్కడున్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. డ్రైవర్ నిద్ర మత్తులో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో అటు నుంచి ఎలాంటి వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. సిమెంట్ ట్యాంకర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో అక్కడే నిలిచిపోయింది. విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టకపోయి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



కరెంటు స్తంభాన్ని ఢీకొని ఆగిపోయిన సిమెంట్ ట్యాంకర్

రబీలో పంటల సాగుకు రైతులు సన్నద్ధం



ఎడ్ల సాయంతో విత్తనాలు వేస్తున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో ప్రస్తుతం రబీ సీజన్‌లో మూడు వేల ఎకరాలలో ఆరుతడి పంటలు సాగు చేసేందుకు రైతులు చర్యలు చేపడుతున్నట్లు ఎఒ దేవి పద్మలత తెలిపారు. వెదురూరు, అనంతపురం, మడూరు, అన్నవరం, టిఓ పల్లె, పిచ్చపాడు గ్రామాల పరిధిలో బుడ్డసెనగ, వేరుశనగ, మినుము, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధపడుతున్నారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండల పరిధిలో 15,850 ఎకరాల్లో వరిపంట, 1,125 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగైనట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం ఆరుతడి పంటల పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. ఈ ఏడాది సాగునీరు పుష్కలంగా ఉండడంతో ఖరీఫ్, రబీ సీజన్‌లో మండల వ్యాప్తంగా పంటలు అధికంగా సాగు అవుతున్నాయని ఆమె తెలిపారు. రైతులు అవసరమైన విత్తనాలు, ఎరువుల సేకరణలో నిమగ్నమయ్యారు. అధికంగా మినుము పంటను రైతులు సాగు చేపడుతున్నారు. మినుము విత్తనాలను కొంతమంది రైతులకు ప్రభుత్వం సరఫరా చేయగా, మిగిలిన రైతులు ఆళ్లగడ్డ, ప్రొద్దుటూరు ప్రాంతం నుండి సేకరించి కొనుగోలు చేసుకుంటున్నారు. వెదురూరు, రాజుపాలెం ప్రాంతంలో వేరుశనగ పంటను రైతులు సాగు చేపడుతున్నారు. విత్తనాలు ప్రొద్దుటూరు, కమలాపురం నుండి కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ఎద్దులు, ట్రాక్టర్ల ద్వారా విత్తనాలను వేస్తున్నారు.

వేంపల్లె జడ్‌పిటిసి అనుచరుడు టిడిపిలోకి జంప్..!

మంత్రి లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరనున్న పలువురు వైసిపి నేతలు


ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక సంస్థల ఎన్నికలు రాకముందే వైసిపిలో ఓ సామాజిక వర్గంలో గుర్తింపు పొందిన పలువురు నాయకులు టిడిపిలోకి వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే టిడిపి నేతలతో కూడా చర్చలు జరిపారు. వారితో టచ్‌లో ఉన్నారు. వేంపల్లె జడ్‌పిటిసికి ఆత్మలాంటి బంధువుగా ఉన్న ముఖ్య అనుచరుడు మాజీ ఉప సర్పంచ్ కొత్తూరు రెడ్డయ్య టిడిపిలో చేరేందుకు ముందు వరుసలో ఉండడంతోపాటు టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డిని కలిసి పార్టీలో చేరేందుకు చర్చలు జరిపారు. కొన్నేళ్లుగా వైసిపి కోసం పని చేసినా గుర్తింపు ఇవ్వకపోవడం, పార్టీలో తమకు ఎలాంటి న్యాయం జరగలేదని, అందుకోసం టిడిపిలోకి వెళ్లి బిటెక్ సారథ్యంలో పని చేయాలని నిర్ణయించుకున్నట్లు పార్టీ మారే నాయకులు పేర్కొంటున్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలోగాని టిడిపిలో చేరేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలిసింది. మాజీ ఉప సర్పంచ్ కొత్తూరు రెడ్డయ్యతోపాటు వైసిపికి చెందిన మరికొందరు నాయకులు టిడిపిలో చేరుతున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. వేంపల్లె జడ్‌పిటిసి వద్ద అంత తామే అయ్యే విధంగా వ్యవహరించిన నాయకుడు టిడిపిలోకి జంప్ అవుతుండడంతో వైసిపి నాయకులు అవాక్కవుతున్నారు. ఈ విషయం వేంపల్లెలో చర్చనీయాంశంగా మారింది. వైసిపి మైనార్టీ నాయకులు కూడా టిడిపిలోకి జంప్ అవుతున్నట్లు సమాచారం. కొత్తూరు రెడ్డయ్యతోపాటు అయన సామాజిక వర్గానికి చెందిన చాలా మంది టిడిపిలోకి జంప్ అవుతుండడంతో వేంపల్లెలో వైసిపికి గండి పడే అవకాశం ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. రెడ్డయ్య మాటను జడ్‌పిటిసి దాటడు అనేది వైసిపిలో ఉన్న అందరి మాట, అలాంటి రెడ్డయ్య వేరే పార్టీలోకి వెళుతున్నాడంటే మతలబు ఏమిటోనని ప్రజలకు, వైసిపి నేతలకు అర్థం కావడం లేదు. జడ్‌పిటిసికి రెడ్డయ్య ఆత్మ బంధువని వైసిపి నేతలు అంటుంటారు.అలాంటి ఆత్మ బంధువును వేరే పార్టీలోకి వెళ్లకుండా అపలేకపోవడం అనేది చర్చనీయాంశంగా మారింది.

కందిపప్పు, నూనె సరఫరా చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని పేద ప్రజలందరికి రేషన్ షాపుల ద్వారా కందిపప్పు, నూనె పంపిణీ చేయాలని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి కోరారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రేషన్ షాపుల ద్వారా నూనె సరఫరా కావడంలేదన్నారు. ఎనిమిది నెలలుగా రేషన్ షాపుల ద్వారా కందిపప్పు కూడా సరఫరా చేయడం లేదన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పేద ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నవంబర్ నుంచైనా రేషన్ షాపుల ద్వారా కందిపప్పు, నూనె సరఫరా చేయాలని తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బిసి కార్పొరేషన్ ద్వారా బిసిలకు స్వయం ఉపాధి పనులకు సబ్సిడీతో కూడిన రుణాలు ఇచ్చేందుకు లబ్ధిదారుల ఎంపిక పూర్తయి ఆరు నెలలైందన్నారు. ఇంతవరకు ఆ పథకం అమలు కాలేదన్నారు. ప్రభుత్వం బిసి కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. బిసి కార్పొరేషన్ బ్యాంకులకు సబ్సిడీ విడుదల చేయకపోవడంతో అవి సబ్సిడీ రుణాలు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బిసి కార్పొరేషన్ ద్వారా బ్యాంకులకు సబ్సిడీ విడుదల చేసి లబ్ధిదారులకు రుణాలిప్పించాలన్నారు. వాటితో వారు స్వయం ఉపాధి పథకాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటోడ్రైవర్ల సేవలో పథకం ద్వారా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఒకొక్కరికి ఏడాదికి రూ.15వేలు ఆర్థిక సాయం చేయడం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వానికి నిజంగా ఆటోడ్రైవర్ల పట్ల చిత్తశుద్ధి ఉంటే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఆటోల ద్వారా జీవనం సాగించే ప్రతి ఒక్క ఆటోడ్రైవర్‌కు ఈ పథకం వర్తించేలా నియమ నిబంధనలు మార్చాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. జిఎస్‌టి సంస్కరణల ద్వారా 345 వస్తువులు ధరలు తగ్గింపు ఉందని ప్రజలకు మోడీ, చంద్రబాబు ఉదరగొడుతున్నారని, క్షేత్రస్థాయిలో మాత్రం లేదని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలపై మాత్రం తగ్గలేదని తెలిపారు. ధరల తగ్గింపుపై ప్రచారం తప్ప, ఆచరణ లేదన్నారు. జిఎస్‌టి సంస్కరణ ఫలాలు ప్రజలకు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలని కోరారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, పూల నజీర్, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

అట్టహాసంగా మార్కెట్ యార్డ్ ప్రమాణం

రైతుల అభ్యున్నతే ధ్యేయం : మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్



చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న గడ్డం అమర్నాథ్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రైతుల అభ్యున్నతి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ తెలిపారు. పులివెందుల వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన పాలకవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. తొలుత చైర్మన్‌గా గడ్డం అమర్నాథ్ యాదవ్, అనంతరం వైస్ చైర్మన్ కల్లూరు చంద్రవర్ధన్‌రెడ్డి, కమిటీ సభ్యులచే మార్కెట్ యార్డ్ సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ముఖ్యమంత్రి చంద్రబాబు, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి, తెలుగుదేశం నాయకులు తనకు మద్దతిచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పులివెందుల ప్రాంత రైతుల సమస్యల పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు పాటుపడుతానని తెలిపారు. పులివెందుల మార్కెట్ యార్డ్‌ను అభివృద్ధి చేస్తానని తెలిపారు. పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. గత వైసిపి పాలనలో ప్రజల సమస్యలను గాలికి వదిలేశారని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు. నూతన పాలకవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో పులివెందుల జడ్‌పిటిసి లత, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అచ్చుగుట్ట రఘునాథరెడ్డి, పులివెందుల మాజీ టిడిపి పట్టణ అధ్యక్షులు మద్దూరు వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర హౌస్ కమిటీ డైరెక్టర్ బాషా, తుంగభద్ర హై లెవెల్ కమిటీ చైర్మన్ జోగిరెడ్డి, హక్కులుగారి విజయ్‌కుమార్ రెడ్డి, నల్లగారి భాస్కర్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం ధరలో కదలిక..అమ్మకాలకు రైతులు సిద్ధం

ప్రజాశక్తి - చాపాడు

గత ఖరీఫ్‌లో సాగు చేసిన వరి ధాన్యం ధరలు గత వారం వరకు దయనీయంగా ఉన్నాయి. నెలల తరబడి నిలకడగా ఉన్న ధరలో కాస్త కదలిక కనపడుతుంది. పుట్టి (8 బస్తాలు)వరి ధాన్యం ధర రూ.14వేల నుంచి రూ.16 వేల వరకు చేరుకున్నాయి. డిసెంబర్ నెలలో వరి నూర్పిడి పనులు చేపట్టిన సమయంలో పుట్టి ధర రూ.12 వేల వరకు పలికాయి. ఆ తర్వాత జనవరి నుంచి రూ.13 వేలకు ధరలు చేరుకున్నాయి. గత నెల వరకు అవే ధరలు కొనసాగుతూ స్థిరంగా ఉన్నాయి. మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 15 వేల ఎకరాల్లో వరి సాగును రైతులు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా కేసీ కెనాల్, కుందూ, పెన్నా, మైలవరం తెలుగుగంగ డ్యాంల పరిధిలో 1,50,000 ఎకరాలకుపైగా వరి పంటను రైతులు సాగు చేపట్టారు. గతంలో ఆగస్టు, సెప్టెంబర్ నాటికి వరి ధాన్యం ధర రూ.18వేల వరకు పలికేవి. ఈ ఏడాది రూ.16వేలు మాత్రమే పలుకుతుండటంతో వరి ధాన్యాన్ని నిల్వ ఉంచి తీవ్రంగా నష్టపోతున్నామని కొంతమంది రైతులు అమ్మకాలకు సిద్ధపడుతున్నారు.



వరి ధాన్యం అమ్మకాలు చేస్తున్న రైతులు

సంచలనం కలిగించిన కల్తీ మద్యం వ్యాపారం

ప్రజాశక్తి-మదనపల్లి

తంబళ్లపల్లి నియోజక వర్గం మొలకలచెరువు కల్తీ మద్యం వ్యాపారం సంచలనం కలిగించిందని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక నిమ్మనపల్లి సర్కిల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి అక్రమ కల్తీ మద్యం తయారీని తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. గత వైసిపి పాలన లోనే అధికంగా కల్తీ మద్యం కేసులు నమోదు కావడంతో పాటు, కల్తీ మద్యం తాగి మృతి చెందారన్నారు. తంబళ్లపల్లి నియోజక వర్గంలో కల్తీ మద్యం తయారీలో పార్టీ ఇన్‌ఛార్జి ప్రమేయం లేదని తెలిపారు. ఇప్పటికే అక్రమ మద్యం తయారీ కేసులో నిందింతులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. మిగిలిన వారిని త్వరలోనే అరెస్టు చేస్తారని చెప్పారు. వైసిపి నుంచి టిడిపిలో చేరిన వారే పద్ధతులు మార్చు కోవడం లేదని, అలాంటి వారే ఇలాంటి అక్రమాలకు తెరతీసి, పార్టీకి చెడ్డ పేరు తీసుకు వస్తున్నారని ఆరోపించారు. గతంలో జరిగిన అక్రమ మద్యం కేసులో అన్ని దార్లు మాజీ ముఖ్య మంత్రి వైపే చూపు తున్నాయని విమర్శించారు. తంబళ్లపల్లి ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి పిఎ రాజేష్ రెడ్డి పిటియం మండలం వైసిపి ఎంపిటిసి చెన్న కేశవ రెడ్డి కుమారుడన్నారు. ఎక్కడైన తప్పు జరిగితే నైతిక బాధ్యత గా క్రమ శిక్షణ చర్యలు తీసుకునే పార్టీ టిడిపి అన్నారు. తెలుగు దేశం పార్టీ అధికారం లో ఉంది కాబట్టే ఇలాంటి నేరాలను వెలుగు లోకి తీసుకు రావడం జరిగిందని, ఎట్టి పరిస్థితుల్లోను అక్రమ కార్య క్రమాలను స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాచవేటి వారిపల్లె గ్రామకమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, టీఎన్ఎస్ఎఫ్ గండికోట గణేష్‌బాబు, నాదెండ్ల జగదీష్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయం ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగుల డిమాండ్లు తీర్చాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

సచివాలయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ తీర్చాలని జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చిన్న మస్తాన్ డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆదివారం జమ్మలమడుగు డిఎల్‌డిఓ కార్యాలయం ఎదుట నిరసన ర్యాలీ, వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న మస్తాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్, జిల్లా కన్వీనర్ మస్తాన్, జమ్మలమడుగు డివిజన్ కన్వీనర్ రాజారెడ్డి మాట్లాడుతూ వాలంటరీ విధులు ప్రస్తుతం ఉద్యోగులకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు. వెంటనే వాలంటరీ విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కొంతమంది అధికారుల వేధింపుల నుంచి రక్షించడానికి ప్రత్యేక చట్టం తేవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులందరినీ మాతృశాఖలో విలీనం చేసి సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌తో కూడిన వేతనాన్ని ఇవ్వాలని వేడుకున్నారు. నోషనల్ ఇంక్రిమెంట్స్‌ను తక్షణమే విడుదల చేయాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు మండలాల యూనియన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పాత గండి రోడ్డులో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానం చేపట్టారు. చింతలమడుగుపల్లె గ్రామానికి చెందిన సింగారెడ్డి వీరమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు ధర్మారెడ్డి వృద్ధులకు అన్నదానం చేశారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. తన తల్లి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది అనాథలకు అన్నదానం చేయడం సంతృప్తిగా ఉందని ధర్మారెడ్డి తెలిపారు. ఆశ్రమ అభివృద్ధికి తమ వంతు చేయూతను అందిస్తామని దాత పేర్కొన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఓబులమ్మ, సార్థక్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రూప, ధర్మారెడ్డి, సౌజన్య, చేతవ్, సింహారెడ్డి, మౌక్తికారెడ్డి పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల శిల్పారామంలో ఆదివారం సాయంత్రం చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. దసరా సంబరాల్లో భాగంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. డ్యాన్స్ మాస్టర్ భవాని కృష్ణ, భవాని కృష్ణ క్లాసికల్ డాన్స్ పులివెందుల చిన్నారుల ప్రదర్శనలను ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథరెడ్డి, ఫీల్డ్ సూపర్వైజర్ ఇస్మాయిల్, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాల నిర్వహణ..అధికారులకు పట్టదా ?

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ ధనాన్ని పొదుపుగా వినియోగించి, వృథాను అరికట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. విద్యుత్ పెద్ద ఎత్తున వృథా అవుతున్నా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. వీధి దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా వెలుగుతూ ఉన్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోవట్లేదు. వివరాల్లోకి వెళితే.. పూసల కొట్టాల గ్రామంలో విద్యుత్ దీపాలు నిరంతరాయంగా వెలుగుతూ ఉన్నాయి. విద్యుత్తు వృథా వల్ల పంచాయతీలపై ఎనలేని ఆర్థిక భారం పడుతుందని ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టి పొదుపు చర్యలు చేపట్టాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.



నేడు గ్రామ సభలు

చాపాడు : మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ పనుల గుర్తింపునకు గ్రామసభలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. అన్నవరం, మడూరు గ్రామాల్లో ఉదయం 10 గంటలకు, నాగులపల్లి, ఖాదర్‌పల్లె గ్రామాల్లో మధ్యాహ్నం మూడు గంటలకు గ్రామ సభలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, స్థానికులు ఆయా గ్రామసభల్లో పాల్గొని ఉపాధి హామీ ద్వారా చేపట్టే పనులపై సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.

మైదుకూరులో.. మైదుకూరు మండల పరిధిలోని తువ్వపల్లె, నంద్యాలంపేట, మిట్టమానుపల్లె, పప్పనపల్లె, విశ్వనాథపురం గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎపిఒ రామచంద్రారెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో నక్కలదిన్నెపల్లె వాసి మృతి

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని గొంది అడవుల్లో నక్కలదిన్నెపల్లె గ్రామానికి చెందిన బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి (55) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ప్రతాప్‌రెడ్డి, గడ్డంవారిపల్లె గ్రామానికి చెందిన యోగేశ్వరరెడ్డి కలిసి శనివారం మండలంలోని గొంది గ్రామ సమీపంలోని తెల్లకొండ అడవి ప్రాంతానికి మంచం కోళ్లకు వెళ్లారు. గొంది అడవి ప్రాంతంలోని తెల్లకొండ సమీపంలో తేనెటీగలు కుట్టి ప్రతాప్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడని యోగీశ్వరరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ప్రతాప్‌రెడ్డి కుమారుడు, బంధువులతో కలిసి పోలీసులు గొంది సమీపంలోని అడవి ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మృతి జరిగిన సంఘటనపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేయడంతో కడప రిమ్స్‌కు తరలించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి పోలీసులు బంధువులకు అప్పగించారు. ప్రతాప్‌రెడ్డి కుమారుడు నవీన్ కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.



మృతి చెందిన ప్రతాప్‌రెడ్డి